# గూనిగుంపన్న

శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తి

అసలా అబ్బాయిపేరు దుర్భాగుంపస్వామి. కాని 'గూనిగుంపన్న' అనేపౌరుషనామం, అతడికి గూని వుండడంమూలాన్ని వచ్చేసింది.

"వెధవా! గూనివెధవా! చాకలిమూటలాంగు గూనీ నివ్వూను; నీ అల్లరి భరించలేకుండా వున్నాం క్లాసులో; నిన్ను పచ్చడిక్రింద దంచేద్దా మన్నంతకోపం నాకు ఉన్నదికాని, నీగూని చూచి కనికరం కలిగి, నిన్ను కొట్టడానికికూడా చేతులు రాకుండా వున్నాయి అన్నారు ఆమేష్టరుగారు.

గుంపన్న చాలా పెంకికుర్రాడు.

ఆనేళ మాష్టరుగారు, క్లాసులో 'ఎటండెన్సు' వెయ్యడానికని ఒకర్ని 'ఫౌంటెన్ పెన్' ఇమ్మన్నారు.

ముందుబెంచీలో కూర్చున్న గుంపన్న 'టప్' మని తన జేబులోనుంచి కలం తీసి, తొందరగా మూతతీస్తూ, పరుగునా మేష్టారు కుర్చీ దగ్గరికివచ్చి, కలం మేష్టారు కందిచ్చాడు.

కాని — ఆ అందించటంలో, మరి గుంపన్న చెయ్యాలనే చేశాడో, లేక అది ప్రమాదమో, చెప్పలేముకాని, ఆ 'ఫౌంటెన్ పెన్'లో నుంచి నల్లని సిరాధార, జొతు కానావలె, మేష్టారి నుదుట్ని కురిసి, గెడ్డం మీదుగా ప్రవహించి, తెల్లని ఉత్తరీయం మీదా, కోటుమీదా, యింకిపోయి, తాత్కాలిక కలంకాన్ని ఆపాదించినది.

అది చూచి క్లాసులో కుర్రాళ్లంతా, గొల్లున నవ్వారు. మేష్టారు 'తహతహ' లాడిపోయి, చిందులుతొక్కడం ఆరంభించారు. అప్పుడైనా ఊరుకున్నాడూ గుంపన్న?

"అయ్యో! మేష్టారూ! అయ్యో మేష్టారూ!" అంటూ ముఖంమీద ఒకనిలువు చారగావున్న సిరా, తనచేత్తో ముఖం అంతటా అలికేసి, ఆచేతిని మేష్టారి పాగాకు తగిలించాడు.

మేష్టారు— వెధవా, గుంపిగా! నువ్వు వెంటనే బెంచీ ఎక్కు.

గుంపన్న— నేనేం తప్పు చేశానండీ? మీరడుగుతే 'పెన్' ఇచ్చానండీ, ప్రమాదం వల్ల సిరా మీమీద పడిందండి. పెన్ ఇవ్వడమే తప్పాండీ?

మే — ముందు బెంచీ ఎక్కు !—ఊ!- ఎక్కుతావా లేదా?

గుం — ఎక్కలేనండి! అని క్రింద నిలబడినాడు.

మే — గాడిద్! అల్లరిచేయగలవుగానీ బెంచీ ఎక్కలేవూ? ఓయ్ మోనిటరూ! వీడు బెంచీ ఎక్కినా సరే, లేక పైకి వెళ్లిపోయినా సరే— అదేదోచూడు. (రొసరొసలాడుతాడు.)

మోనిటరు గుంపన్న సీటుదగ్గరికి వెళ్లి, చిరునవ్వు నవ్వుతూ, "మేష్టారు ఎక్కమంటున్నారోయ్-వేగం ఎక్కు" అన్నాడు.

అప్పుడు గుంపన్న బెంచీ ఎక్కడానికి ప్రయత్నించి, పొట్టివాడగుటచేత ఎక్కలేక పోతాడు. క్లాసంతా 'గొల్లు' మని నవ్వు తారు.

గుం—ఎక్కడానికి నాకేం అభ్యంతరం లేదుకాని, ఎవ్వరైనా ఎక్కించాలి మరి.

మే—(నవ్వి) అదా నీఘోష ?

ఇంతలో మోనిటరు రెక్కపట్టుకుని ఎత్తగా గుంపన్న అతికష్టంమీద బెంచీ ఎక్కుతాడు. అది చూచి మేష్టారు,

"అయితే, కింద నుంచో ఈ 'కీరిడం' తా. నీగూని నిన్ను కాపాడుతోంది నిజం గా" అన్నారు.

గుంపన్న కిందికి గంతువేసి, లోలోపల నవ్వుకుని, "నాకు గూని ప్రసాదించినందుకు దేముడికి పది నమస్కారాలు" అన్నాడు.

గుంపన్న పెంకివాడైనా, మాంచి తెలివి తేటలుగల కుర్రాడు. అందుకే మేష్టర్లందరికీ వాడంటే అభిమానం.

గుంపన్న 'స్కూలుఫైనలు' ప్యాసై నాడు.

* * *

రామయ్యశెట్టి, ఆవూళ్లో ఒక సంపన్న గృహస్థు. అతనిది ఇనుపసామానువర్తకం. అతడికి ఒక తెలివైన గుమస్తా కావలసి వచ్చింది. శెట్టి ఆ ఉద్యోగానికి తప్పకుండా గుంపన్ననే నియమిస్తాడని వూరంతా అను కున్నారు. కాని దైవసంకల్పం వేరయింది. ఇంతకూ శెట్టిగారి గృహిణి— ఆవిడ రెండో పెళ్లి పెళ్లాం శెట్టిగారికి— ఆవిడగారి అను గ్రహం గుంపన్నపై లేకపోయింది. ఆవిడ మాంచి ఎర్రగా బుర్రగా వున్న ఇరవై యేళ్ల వయసుగల ఒక కుర్రాడినిగూర్చి భర్తతో, ఆవుద్యోగానికి గట్టిగా సిఫారసు చేసింది. అతడికే వుద్యోగం యివ్వాలని భీష్మించింది.

"గూనివాడు నాగుమ్మంలో అడుగు పెడితే నేను వప్ప"నంది. అంతేకాక "గూని వాడిమొగం చూడనని వ్రతం" అన్నది.

పాపం శెట్టిమాత్రం,

స్త్రీవతాలు నట్టింట్లోనూ, గుమస్తా పావిడిలోనూ; నాగుమస్తా గూనైతే నీకేం? అని అడ్డువాదనకు దిగాడు. కాని ఆవిడ వాల్చూపు ఒకటి అతనిమీద పారేసి, "అయితే నామాట వినరుకదూ?" అని సగం దీనత్వంగానూ, సగం తాటించినట్లూ అనే సరికి రామయ్యశెట్టి మెత్తబడిపోయాడు— వామాక్షి వాల్చూపులకు మెత్తబడని పురుషు డుంటాడా మరి?

మూడేళ్లు గడిచినాయి. ఇంతలో ఒక నాడు ఆగృహిణి హటాత్తుగా, ఆగుమస్తా తోనూ, నగలపెట్టెతోనూ, లేచి చక్కా పోయిందని వూళ్లో వదంతి చెలరేగింది. తరువాత కథ సంగ్రహంగా యిదీ:—

పోలీసులు—సెర్చివారంటు—హాహా కారం—స్టేషను—ఎరస్టు—లంచం—గుప్ చుప్ !—కాని ఆ గ్రామంలో ఆ గుమస్తాను తిట్టని పెద్ద మనిషి లేడు. ఇదంతా చూచాడు మన గుంపన్న. "ఆడవాళ్లు ఎంతకైనా సాహసు లురా,నాయినా! కొంపతీసి, నేనే గుమస్తా నయ్యుంటే, నాకేం బుద్ధిపుట్టేదో! ఇంతకూ పైచవులు మరగిన ఆడదానికి వాడేమిటి,

వీడేమిటి? నాగూని ధర్మమా అని నేను బ్రతికిపోయాను. నాకు గూని ప్రసాదించిన బ్రహ్మకి నూరు నమస్కారాలు."

* * * *

కొన్నాళ్లకు గుంపన్నకుకూడా యౌవనం అంకురించింది. గూనైతే వుండొచ్చుగాని, కాలానుకూలంగా హావభావాలు మారవూమరి? యౌవనం పొడచూపేసరికి గుంపన్నకుకూడా నూతనభావాలు ఉదయించినాయి.

వీపుమీద గూనికాని, మనస్సుకి గూని లేదుగా మరి? గుంపన్నకూడా ఆడపిల్లలవైపు వెర్రిచూపులు చూడ్డం ప్రారంభించాడు.

అవూళ్లో శ్యామల మంచి చక్కని పిల్ల, 'స్కూల్ ఫైనల్' చదువుకుంటూంది, అతివయ్యారంగా నడిచేది. పదిహేనేళ్ల వయస్సు. వయస్సుకు సరిపోయినట్టుగా శరీరంలో మార్పులు కనిపిస్తున్నాయి.

ఆమె నడుస్తూంటే, గాలిలోంచి సున్నితంగా ఎగిరిపోయే ఒక దేవకన్యలాగు కనుపించేది. లోలాకులు వుయ్యాల లూగుతూండగా, ఆమె అతిధీమాగా నలుగుర్నీ చూస్తూ మందహాసం అనేవెన్నెల నలుదిక్కులా ప్రసరింపచేస్తూ సాయంకాలం 'పార్కు' నుంచి ఇంటికి పోతూంటే ఆమెను చూచి చకితులైపోయేవారు కుర్రాళ్లంతా. ఎవళ్ల మట్టుకివాళ్లే, "నన్నుచూచి నవ్విందంటే, నన్నుచూచి నవ్వింద"ని మురిసిపోతూండేవారు.

ఒకనాడు శ్యామల గుంపన్నవైపు చూచి నవ్వడం సంభవించింది. అదేలాగంటే?

సాయంకాలం ఎలక్ట్రిక్కుదీపాలు అప్పుడే వచ్చాయి. శ్యామల పార్కునుంచి యింటివైపు పోతూంది. గుంపన్న కోవెల్లో హరికథ విని అటునుంచి వస్తున్నాడు. శ్యామల సిల్కు చేరుమాలు ప్రమాదవశాత్తూ చెయ్యిజారి రోడ్డుమీద పడిపోయింది. గుంపన్న కప్పలాగు గెంతుకుంటూ పోయి రుమాలు తీసి, దులిపి శ్యామల కందిచ్చాడు. శ్యామల నవ్వుతూ,

"Thank you, very much" అంది.

"Don't mention, please" అన్నాడు గుంపన్న నవ్వుతూను.

"But we will mention it to all please" అన్నారు పక్కనిచెరువుగట్టుమీద కూర్చొని, ఇదంతా కనిపెడుతూన్న నలుగురు తుంటరికుర్రాళ్లు.

"గూనివాడుకూడా ఒకకథానాయకుడౌతున్నాడురోయ్!" అన్నాడు మరొక్కడు.

గుంపన్న మనస్సు పాదరసంలాగు పరుగెత్తడం ఆరంభించింది. శ్యామల నాడు నవ్విందంటే నిజంగా తన్ను ప్రేమించినదనే అనుకున్నాడు. పాపం! శ్యామల తనగూని చూచి వెక్కిరింతనవ్వు నవ్విందని అతనికి తెలిసిందికాదు.

మరి నెలరోజులకే శ్యామలను విశ్వపతిరావు అనేఅబ్బాయి కిచ్చి పెళ్లి చెయ్యడానికని ప్రధానం చేశారు పెద్దలంతా కలిసి. గుంపన్నగుండెకాయ చెక్కలైపోయినట్టయింది. శ్యామలవిషయంలో తన పొరపాటు గ్రహించాడు గుంపన్న. క్రమేణ చెక్కలైపోయిందనుకున్న అతని గుండెకాయ మళ్లీ కలిసిపోయినట్టయింది.

ఇంతలో యుద్ధం వచ్చింది.

విశ్వపతిరావునే కాకుండా, ఆవూళ్లో యువకులందరినీ Active serviceకి నిర్బంధించారు గవర్నమెంటువారు. గూనివాడు కాబట్టి గుంపన్న తప్పుకున్నాడు. విశ్వపతిరావు వెళ్లిపోతే శ్యామల తన్నే పెళ్లాడ్డానికి ఛాన్సు వుందనుకున్నాడు గుంపన్న.

సేనలో చేరబోయే యువకు లంతా వెళ్లేరోజు వచ్చింది.

శ్యామల విశ్వపతిరావు భుజంమీద శిరస్సు వంచి వెక్కివెక్కి యేడుస్తూంది.

శ్యామల—విశ్వం, నువ్వు యుద్ధభూమి నుంచి జయంపొంది వచ్చేవరకూ నీనామమే జపిస్తూంటాను.

విశ్వ—మన యిరువురి ప్రేమప్రవాహానికి భగవంతుడు ఇల్లాంటి అవరోధం కలిగిస్తా డనుకోలేదు, శ్యామలా. కాని నీవు ధైర్యంగా, ఉత్సాహంగా వుంటానని ప్రమాణం చేస్తే, నేను ధైర్యంగా రణరంగానికి పోతాను. ఊరడిల్లి నన్ను పంపించు.

శ్యామల—సరే. జయం పొంది తిరిగి రా. కాని నువ్వు ఒక్కయేడాదిలో తిరిగి రాకపోతే, నేను కృశించిపోయి, అలాగే ప్రాణాలు వదలేస్తాను, నీ నామాక్షరాలు పెదవులుమీద నుంచుకొని.

విశ్వ—నెలకు రెండుత్తరాలు రాస్తుంటాలే. అని ఆమె చెక్కిలి నొక్కి, ముద్దెట్టుకున్నాడు. గుంపన్న యిదంతా కనిపెడుతూనేవున్నాడు. దుఃఖం పట్టలేకపోయాడు.

“పవిత్రమైన ప్రేమ అంటే విశ్వం శ్యామలదే” అనుకున్నాడు.

విశ్వపతిరావు యుద్ధానికి వెళ్లిపోయిన మూడునెలలకే శ్యామలని ఒక పుస్తకాల వర్తకుడైన శ్రీనివాసం అనే అబ్బాయి కిచ్చి ఆపెద్దలే—ఎవరైతే శ్యామలను విశ్వాని కిచ్చి వివాహం చేద్దామని ప్రధానం చేశారో, ఆ పెద్దలే—ముడెట్టేశారు. పెళ్లవడమే వాళ్లకు కావాలిగాని, ప్రేమవ్యాసు వాళ్ల కెందుకూ? ఈవిధంగా, శ్యామల విశ్వపతిరావుపట్ల చేసిన శపథాలన్నీ గాలిబుంగలక్రింద ఎగిరిపోయాయి.

శ్యామల శ్రీనివాసానికి ‘ధర్మపత్ని’ అయింది—పెద్దలధర్మమా అని.

ఒకనాడు గుంపన్న డైరీ కొందామని శ్రీనివాసంయింటికి వెళ్లాడు.

ఇంటిసావిడిలోనే షాపు. శ్రీనివాసం, లోపల భార్య శ్యామలతో ఏదో ఘర్షణ పడుతూన్నట్టుంది.

శ్యామలనోరు మహాఎక్కువ ధాటీగా వినిపిస్తూంది. కేకలు సావిడివేపునకే వస్తూన్నవి.

ఇంతలో శ్రీనివాసం ముందుపరుగెత్తుకొంటూ వచ్చాడు. ఆవెనుక శ్యామల—భీకరమూర్తి. నిజంగా అపరకాళికాదేవివలె వుంది. అది భార్యాభర్తల కలహం. కేవలం మాటలతోనే అంతమయ్యేటట్టు కనుపించలేదది. శ్యామలచేతిలో దొడ్డిచెం బున్నది. శ్యామల కోపోద్దీపితులురాలు. మహావిష్ణువు చక్రం వదిలినట్టుగా ఆదొడ్డిచెంబు గురిచూచి, శ్రీనివాసం తలవైపు విడిచిపెట్టింది. ‘టంగ్’ మని శబ్దం. అటుతరువాత శ్రీనివాసం తలకాయ రక్తంలో తడసిపోవడం. శ్రీనివాసం తల రెండుచేతులతో పట్టుకుని

కుర్చీలో చదికిలబడడం. ఇదంతా మూడు క్షణాల్లో జరిగిపోయింది.

ఈ వ్యవహార మంతా గుంపన్న చూచాడు. "నాకు గూని వుండిపోబట్టిగానీ, లేకపోతే—నన్ను శ్యామల పెళ్లాడితే—నాగతి ఏమైయ్యుండును? నాగూనికి వెయ్యి నమస్కారాలు" అనుకుంటూ షాపులో నుంచి వీధిలోకి ఒకచే కుప్పిగంతువేసి నిష్క్రమించాడు.

సతీపతుల కలహం కళ్లారా చూచిన గుంపన్నకు పెళ్లి అంటేనే ఏవగింపుకలిగింది. పెళ్లాడితే తన స్వేచ్ఛకు భంగం అనుకున్నాడు. విచ్చలవిడిగా బ్రహ్మచారిగా వుండిపోయి జన్మాంతం చూసేద్దా మనుకున్నాడు.

ఒకనాడు బ్రహ్మచారి గుంపన్న, సాయంకాలం షైరు పోతూండగా ఊరు బయట— చిన్న అడవి ప్రదేశంలాంటి చోట, క్రిందపడివున్న ఒకచింత మొద్దుమీద, ఒక పురుషవ్యక్తి సైనికదుస్తులు వేసుకుని కూర్చొనివున్నాడు అంధుడు. దిక్కు తెలియక తలమాత్రం యిటు అటూ తిప్పుతున్నాడు.

"కళ్లులేని కబోదిని బాబయ్యా, చూడ నేత్రాలు లేవు, అమ్మల్లారా, నాజోలిలో ఒకదమ్మిడీ పడెయ్యండి బాబుల్లారా" అని తనయాచనే ఒకపాటగా చేసి ఆర్తనాదం చేస్తున్నాడు.

గుంపన్న—ఏయ్, అబ్బీ! చెయ్యిపట్టు ఒకడబ్బు వేస్తా.

వ్యక్తి—మెడలోవున్న నాజోలిలో పడేయండి బాబూ!

గుంపన్న—నీజోలి నేను అంటను. చెయ్యి పట్టు.

వ్యక్తి—రెండు చేతులూ లేవండి బాబయ్యా!

గుంపన్న—ఏమిటీ! నీచేతులు రెండూ ఏమైనాయి? (తనలో) కంఠస్వరం పరిచితమైనదానిలా గున్నదే!

వ్యక్తి—యుద్ధంలో గుండుదెబ్బలు తగిలితే, ఆస్పత్రిలో తీసిపారేశారు బాబయ్యా.

గుంపన్న—కొంపతీసి నువ్వు మావిశ్వపతిరావు కావుగదా?

వ్యక్తి—నాపేరు అదేనండీ బాబయ్యా! తమ రెవరండీ?

గుంపన్న—ఈవూర్లో గుంపన్న నెరుగుదువ్? నేను గుంపన్నని. పాపం! విశ్వం, నీస్థితి చూస్తే నాకు చాలా దుఃఖంగావుంది. ఇకను నీజీవితం ఎలాగు గడుస్తుందా అని నేనాలోచిస్తున్నాను. అప్పటిస్థితికీ ఇప్పటిస్థితికీ ఎంత వ్యత్యాసం! అద్భుతం! ఈశ్వరలీల!

విశ్వ—శ్యామల బాగుందీ?

గుంపన్న—శ్యామలకేం బంగారుతల్లిలాగుంది. ఆమె రేపో, నేటో, ఒకశిశువుకు తల్లి కాబోతుంది. నీళ్లాడేప్రొద్దు లామెకు.

విశ్వ—చాలా సంతోషం. శ్యామలకు వివాహం అయిందంటే పరమ సంతోషం. వెర్రిమొగంలాగు నాకోసం ఎదురుచూస్తూ బ్రహ్మచారిణై కూర్చోకుండా!—

గుంపన్న—అలా అనుకోవడం నీ వెర్రి!—నువ్వు వెళ్లిన మూడుమాసాలకే

'భారతీ బుక్‌స్టాలు' మేనేజరు శ్రీనివాసాన్ని పెళ్లి చేసుకుంది.

విశ్వ—వాళ్లిద్దరూ సుఖంగా వున్నారు. నా కంతే చాలు!

గుం—కావలసినంతసుఖం. సుఖానికేం?

అని గుంపన్న పూరుమార్గం పట్టాడు.

"అహా! దైవసంకల్పం. ఒకప్పుడు స్ఫుర ద్రూపినని మురిసిపోతూండిన విశ్వపతిరావుకు అంగవైకల్యం, అంధత్వం! నాలాగు గూని వుండివుంటే తన కీ బాధ తప్పిపోనుకదా? నాగూనికి పదివేల నమస్కారములు!" ఇటువంటి ఊహాలతో గుంపన్న తన యిల్లు చేరి పడకకుర్చీలో చేరబడ్డాడు.

"బాబూ! స్నానానికి వేడినీళ్లు కాగినై" అన్నది పనిమనిషి అంకమ్మ.

* * *

ప్రతీమనిషికీ ఏదో ఒకగూని—ఏదో ఒకలోపం అని మనం అనుకునేది,—ఏదో ఒక లోటుబాటు – వుంటూనే వుంటుంది. అలాంటిలోపం వుండడమే మంచిదనుకోండి. అలాంటి లోటుబాటువల్ల మన కెంతలాభం వుంటుందో మనం ఊహించలేము, నిజంగా. అది దైవేచ్ఛ. దైవం ఆలాటి లోపం మనలో వుంచినందుకే మనం కృతజ్ఞులమై యుండాలి. సెలవు.

(ఒక ఆంగ్లరచన ననుసరించి.)



GOLDEN
AMLA
HAIR OIL
గోల్డెన్ ఆమ్ల హైర్ ఆయిల్

గోల్డెన్ ఆమ్లలో చేర్చబడిన పదార్థములన్నియు ప్రకృతినుండియే నేరుగా తీసుకొనబడినవి. ఇందు చేర్చిన వనమూలికలనుండియే ఈనూనెకు రంగు ఏర్పడినది. ఈ వనమూలికలు వెండ్రుకల పెరుగు దలకు, పోషణకు చాల శ్రేష్ఠమైనవి. ఈ నూనె తలపై చర్మమును పరిశుభ్రపఱచి, వెండ్రుకల కుదురుకు బల మొసంగును. దీనిని వాడిన వెండ్రుకలు దట్టముగాను, నల్లగా నుండును. నిగనిగ లాడుచుండును.

స్నానమునకు, అలంకారమునకు
అనుకూలించును

BENGAL CHEMICAL :: Calcutta---Bombay.

మదరాసు ఏజంట్లు:—య్మ్. దేశాయిగౌండరు అండు కో.,
41, బందరువీధి, మదరాసు.